జేఎన్టీయూ వర్సిటీలో భోజనశాల ప్రారంభం

బాలానగర్: జేఎన్టీయూ యూనివర్సిటీలో పీజీ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన భోజనశాలను యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, పలువురు డైరెక్టర్లు, కాలేజీ ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మోతీనగర్: కూకట్‌పల్లి ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును శనివారం కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రేష్మ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యక్షురాలు సంధ్య, సీనియర్ నాయకులు వనజ, సుజాత, వాణి, ఆస్మాబేగం తదితరులున్నారు.

సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించండి

నిజాంపేట్: సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి కాలనీ అభివృద్ధికి సహకరించాలని మదర్ థెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు కోరారు. శనివారం నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో ఇంటింటికీ పర్యటిస్తూ ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆస్తి పన్నులు చెల్లిస్తే కాలనీలో మౌలిక సదుపాయాలు సమకూరుతాయన్నారు.





అపరిశుభ్ర వాతావరణంలో జలకన్య సెంటర్‌లోని ఆలె నరేంద్ర పార్కు

పార్కు.. అధ్వానం

- ఆలె నరేంద్ర పార్కులో అరకొర వసతులు
- 35 ఏళ్లుగా ఇదే దుస్థితి అంటున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: జలకన్య సెంటర్‌లోని ఆలె నరేంద్ర పార్కు అధ్వానంగా తయారైంది. కాలనీకి ఇదొక్కటే పార్కు..పైగా చాలీచాలనంత స్థలంలో ఉంది. ఈ పార్కు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి అరకొర వసతులతో(35 సంవత్సరాలుగా)నే సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు లేకపోగా.. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు సాయంత్రం వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది.

వ్యర్థాలతో కంపు కొడుతోంది..

ఆలె నరేంద్ర పార్కుని జీహెచ్‌ఎంసీ కార్మికులు శుభ్రం చేయకపోవటంతో చెత్తాచెదారం, మందు బాటిళ్లు, మూగజీవాల వ్యర్థాలతో కంపు కొడుతోంది. ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతంలోని వృద్ధులు కాలక్షేపం కోసం ఉదయం, సాయంత్రం ఇక్కడకు వచ్చి సేదతీరుతుంటారు. దీంతో ఇక్కడ పేరుకుపోతున్న చెత్తను వారే చేతనైనంత వరకు శుభ్రం చేసుకుంటున్నారు. అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో పిల్లలు సైతం ఇటువైపు రావడం లేదని వృద్ధులు చెబుతున్నారు. లైట్లు లేకపోవడంతో సాయంత్రం వేళల్లో పోకిరీలు, మందుబాబులు చేసే హడావుడితో పార్కుకు రావాలంటే చాలా మంది భయపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు సైతం నిర్వహణ లేక కంపుకొడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ పార్కుకు కనీస వసతులు కల్పించడంతో పాటు చిన్నారుల కోసం ఆట వస్తువులు, మొక్కలు నాటించాలని స్థానికులు కోరుతున్నారు.



వినియోగంలోకి టాయిలెట్లు

వసతులు కల్పించాలి..



ఆలె నరేంద్ర పార్కులో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే కనిపిస్తుంది. ఈ పార్కులో గతంలో వృద్ధులు సేదతీరడానికి మంచి వాతావరణం ఉండేది. అయితే, వసతులు లేకపోవడంతో మందుబాబులు ఇక్కడే తిష్టవేస్తున్నారు. స్థానిక నాయకులు, అధికారులు చొరవ తీసుకొని పార్కులో మంచి వాతావరణం కల్పించాలి.

– కుమార్ యాదవ్, స్థానికుడు

ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ చూపు కాంగ్రెస్ వైపు?



దొడ్ల వెంకటేశ్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: మారుతున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరే అవకాశం కనిపిస్తోంది. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం అధికార పార్టీలో చేరాలని ఆయన కోరుకుంటున్నట్టు తెలుస్తోంది. స్థానిక నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సైతం ఆయన అభిప్రాయంపై అనుకూలంగా ఉన్నట్లు సమాచారం. కార్పొరేటర్‌తో పాటు యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్, పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనతో పాటు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు తెలుస్తోంది.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో శనివారం కూకట్‌పల్లి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. రెడ్డి కులస్తులకు సమన్యాయం చేయాలనే దృక్పథంతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏ–బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, తెలంగాణ స్టేట్ మహిళ అధ్యక్షురాలు పుష్పరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేరి సతీశ్ రెడ్డి, పులి శివకుమార్ గౌడ్, పులి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జియో టెక్నికల్ అప్లికేషన్‌పై వర్క్‌షాప్

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శనివారం జియో టెక్నికల్ అప్లికేషన్స్ అంశంపై ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్ డా.జీవీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ వర్క్‌షాపునకు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వరరావు, సివిల్ డిపార్టుమెంట్ హెచ్ఓడి డా.దీన్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



వర్క్‌షాపును ప్రారంభించిన నర్సింహారెడ్డి తదితరులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మూసాపేట: పంచశీల స్కూల్‌లో శనివారం బ్లెస్సింగ్ డే నిర్వహించారు. కార్యక్రమానికి స్మార్ట్ కెన్నడి స్కూల్ చైర్మన్ సూర్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ అందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా పరీక్షలు రాయాలన్నారు. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పంచశీల శ్రీనివాస్, వైస్ చైర్మన్ డి.అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సూర్యనారాయణ తదితరులు

ఈటలను గెలిపించుకుందాం: 'వడ్డేపల్లి'



సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్ తదితరులు

కూకట్‌పల్లి: కార్యకర్త స్థాయి నుంచి ఇక్కడి వరకు వచ్చిన ఘనత ఈటల రాజేందర్‌కే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాదవరం కాంతారావు, నాయినేని సూర్యప్రకాష్‌రావు, శ్రీకర్‌రావు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు పదవీ విరమణ శుభాకాంక్షలు



ఎంఈఓ దంపతులను సన్మానించిన కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు

మూసాపేట: స్థానిక దేవి గ్రాండ్ హోటల్‌లో శనివారం కూకట్‌పల్లి మండల విద్యాధికారి ఆంజనేయులు రిటైర్‌మెంట్ కార్యక్రమం కూకట్‌పల్లి ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులు దంపతులను పలు పాఠశాలల కరస్పాండెంట్‌లు సన్మానించారు. అనంతరం కూకట్‌పల్లి మండల రికగ్నైజ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన డైరీ, కేలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. పాఠశాల కరస్పాండెంట్‌లు పాఠశాల రిజిస్టర్, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.కమలాకర్, ప్రధాన కార్యదర్శి కె.రవిబాబు, కోశాధికారి ఎం.సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ రామకృష్ణ, పంచశీల శ్రీనివాస్, సయ్యద్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే ధైర్యం చాలా అవసరం



ఉమెన్ సేఫ్టీ వింగ్ పోలీస్ అధికారి రిమా రాజేశ్వరి

హఫీజ్‌పేట్: ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి ధైర్యం చాలా అవసరమని ఉమెన్ సేఫ్టీవింగ్ పోలీస్ అధికారి రిమా రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి, మహిళ దక్షిత సమితి విద్యా సంస్థలు, సుమన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ రీమ రాజేశ్వరి, టెక్నికల్ డైరెక్టర్, శ్రీసిమెంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఉమా గోర్క, మహిళా దక్షిత సమితి విద్యా సంస్థల ట్రస్టీ సభ్యులు సౌరబ్ కొఠారి, మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధైర్యంతో పాటుగా ఆత్మరక్షణ చాలా అవసరమన్నారు. ప్రతి నిర్ణయాన్ని స్వతహాగా తీసుకుంటూ ముందుకు వెళ్ళాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శకుంతల, ఉషా మాల్పాని, నళిని, అనసూయ, కళాశాల పిన్సిపల్ రమా కుమారి, సుశీల పాటిల్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మేకప్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

కూకట్‌పల్లి: ఎంతోమందికి మేకప్ ట్రెనింగ్ ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధికి కృషి చేస్తున్నామని ఆర్‌కే మేకప్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని రెండో ఫేజ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌కే మేకప్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌ను సినీ నటి హిమజ శనివారం ప్రారంభించారు. నాణ్యమైన కోచింగ్‌తో పాటు హాస్టల్ వసతితో అతి తక్కువ ఫీజుతో ట్రెనింగ్ ఇస్తున్నామని ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి తెలిపారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటి హిమజ

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం రేపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసి కల్యాణ ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీశైలంగౌడ్‌ను కలిసిన వారిలో దూలపల్లి బీజేపీ నాయకులు రమేశ్, అశోక్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లింగంపల్లి టు ఘట్‌కేసర్

విస్తరిస్తున్న ఎంఎంటీఎస్ రైలు సౌకర్యం



శేరిలింగంపల్లి: ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సర్వీస్) రైలు సౌకర్యం మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. ఇప్పటికే సికింద్రాబాద్, నాంపల్లి, ఫలక్‌నామా వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించగా ..తాజాగా ఘట్‌కేసర్ వరకు విస్తరించడంతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగింది.

ఘట్‌కేసర్‌కు ఎంఎంటీఎస్ సౌకర్యం

- లింగంపల్లి నుంచి ఘట్‌కేసర్‌కు ఎంఎటీఎస్ రైలు సౌకర్యం విస్తరించడంతో 123.52 కిలోమీటర్లకు పెరిగింది.
- ఈ కొత్త రైలు ఘట్‌కేసర్, చర్లపల్లి, మల్లాపూర్, నేరెడ్‌మెట్, సుచిత్రా, భూదేవినగర్ వంటి ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగుతాయి.
- మొదటి రైలు ఘట్‌కేసర్‌లో ఉదయం 7.20 గంటలకు ప్రారంభమై లింగంపల్లికి 9.15 గంటలకు చేరుకుంటుంది.
- చివరి రైలు లింగంపల్లిలో సాయంత్రం 5.45 ఆరంభమై ఘట్‌కేసర్‌కు రాత్రి 7.30 గంటలకు చేరుకుంటుంది. ఈ రైల్లో పీర్జాదిగూడ, సుచిత్రా సెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్, మౌలాలి హౌసింగ్‌బోర్డు హైలెవల్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

యాదగిరిగుట్టకు వెళ్లే వారికి మేలు

- లింగంపల్లి, పరిసర ప్రాంతాల నుంచి యాదగిరిగుట్టకు వెళ్ళాలంటే బస్సులో రాకపోకలు ఉంటాయి. ఎక్కు శాతం బస్సులపైనే ఆధారపడాల్సి వస్తోంది.
- ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైలు సౌకర్యం ఉండడంతో అక్కడి వరకు వెళ్లి తర్వాత ప్రైవేటు వాహనాల్లో భువనగిరి మీదుగా యాదగిరిగుట్టకు వెళ్లవచ్చు.

నాంపల్లి, ఫలక్‌నామా, మేడ్చల్‌కు ..

- లింగంపల్లి నుంచి ఇప్పటికే నాంపల్లి, ఫలక్‌నామా, మేడ్చల్ వరకు వెళ్లొచ్చు
- ప్రయాణికులకు సౌకర్యంతో బాటు తక్కువ చార్జీ ఉండడంతో ఎంఎంటీఎస్‌లలో రద్దీ పెరిగిపోతోంది.
- ట్రాఫిక్ రద్దీ నుంచి ప్రయాణికులకు విముక్తి కలిగించేందుకు ఎంఎంటీఎస్ ఉపయుక్తంగా మారింది.
- ఇక కొత్తగా పలు ప్రాంతాలకు ఎంఎంటీఎస్ సేవలను విస్తరించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం లేకపోలేదు. లింగంపల్లి ఎంఎంటీఎస్ స్టేషన్ వైపు మరిన్ని సౌకర్యాలను కూడా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది



నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తదితరులు



కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్–1 వద్ద.. సతీశ్ అరోరా, కార్పొరేటర్ శిరీష బాబూరావు తదితరులు

కవిత అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాలు కొనసాగించారు.

–మోతీనగర్/బాలానగర్/మూసాపేట/ఓల్డ్ బోయిన్‌పల్లి జోన్ బృందం



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



మూసాపేటలో.. డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తదితరులు



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

'బచ్‌పన్'లో గ్రాడ్యుయేషన్ డే



భాగ్యనగర్‌కాలనీ: స్థానిక బచ్‌పన్ పాఠశాల శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు అన్ని రంగాల్లో చిన్నారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం చిన్నారులు టోపీ ధరించి పట్టాలతో పాఠశాల ఆవరణలో సందడి చేశారు.

పరిశోధనలు సమాజానికి మేలు చేయాలి

- ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ.పీజే నారాయణన్
- ట్రిపుల్‌ఐటీ ఆర్ అండ్ డీ షోకేస్ అదుర్స్
- 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కిపైగా పోస్టర్లు డెమోలు, నమూనాల ప్రదర్శన



ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్న అతిథులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొ.పీజే నారాయణన్

రాయదుర్గం: నూతన ఆవిష్కరణలు.. రకరకాల పోస్టర్లు... ఆయా అంశాలపై ఆలోచింపచేసేలా ప్రదర్శన సాగింది. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో రెండు రోజులపాటు సాగే వార్షిక ఆర్ అండ్ డీ షోకేస్‌ను శనివారం ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీలోని 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కి పైగా పోస్టర్లు, డెమోలు, నమూనాలను ఇందులో ప్రదర్శించడం విశేషం. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో బాధ్యతాయుతమైన ఏఐ, రీథింకింగ్‌పై రౌండ్ టేబుల్ చర్చలు, పరిశోధనా రిఫ్లెక్షన్లు, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ) ద్వారా పరిశోధనా స్టార్టప్‌లను కూడా షోకేస్‌లో ప్రదర్శించారు. ఈ షోకేస్‌లో అడ్వాన్స్ మల్టీ మోడల్ రీసెర్చ్ వెహికిల్, మల్టీ సెన్సార్ బైక్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఇండియన్ టు వీలర్ డ్రైవింగ్ డేటా సెట్ వాహనం ప్రదర్శనలో, సిస్మోగ్రాఫ్ డిస్‌ప్లే, ప్రత్యేకంగా రూపొందించిన డ్రోన్, రాజస్థాన్ ఇళ్ల నమూనాలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. సమాజానికి మేలు చేసేలా అధ్యాపకులు, విద్యార్థుల పరిశోధనలు ఉంటాయని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా 'రైట్ టు నో యువర్ అల్గారిథమ్'లపై చర్చా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉషా రామనాథన్, సెంటర్ ఫర్ ఇంటర్‌నెట్ అండ్ సొసైటీ బెంగళూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన్వీర్ హసన్, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ప్రొఫెసర్ కృష్ణ, శ్రీనివాస్, పాల్గొన్నారు. అనంతరం టెక్ బదిలీ కార్యాలయంలో సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పేటెంట్ గ్రహీతలను సత్కరించారు.

ఆకట్టుకున్న మోహినీయట్టం

మాదాపూర్: కళాకారులు భరతనాట్యం, మోహినియట్టం ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కోల్‌కత్తాకు చెందిన భరతనాట్య కళాకారుడు కరుణ కేతన్ శంకర శ్రీగిరి, రామచంద్ర భజన, దేశ్ తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. నిత్య శిష్యబృందంచే మోహినీయట్టం, భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. రంగపూజ, గణేశకౌతం, భాగ్యదా లక్ష్మీ, మోహినియట్ట వర్ణం, మూషికవాహన, శబ్దం, నిత్య, శాన్వి, కృష, వామిక, వలిక, రిషిక, అలీన, సహస్ర ప్రదర్శించారు.



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

నిజాంపేట్: నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని కమ్యూనిటీ హాలులో శనివారం మన సేవా టూ మ్యాన్‌కైండ్ స్వచ్ఛంద సంస్థ, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కంటి పరీక్షలతో పాటు హియరింగ్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. యశోద ఆస్పత్రి(హైటెక్‌సిటీ బ్రాంచ్) సౌజన్యంతో కార్డియాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, అస్తమాలజీ, డెంటల్ పరీక్షలు, అదేవిధంగా వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, ప్రైమ్ రిహాబ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో చిన్నారులు, పెద్దలకు హియరింగ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో 300 మంది పరీక్షలు చేయించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.